సాక్షి నిజామాబాద్

శనివారం ॥ 15 ॥ జూన్ ॥ 2024



వేగంగా 'ఆస్పత్రి' పనులు

గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యం అందించేలా ధర్పల్లిలో వంద పడకల ఆస్పత్రి నిర్మాణం చేపడుతున్నారు.

- 8లో ▸



తల్లి మందలించిందని..

తల్లి మందలించిందని ఓ యువకుడు సెల్ టవర్ ఎక్కిన ఘటన నస్రుల్లాబాద్ మండలం బొమ్మన్‌దేవ్‌పల్లిలో చోటుచేసుకుంది.

- 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 37.8 /25.8

ఉదయం ఎండ తీవ్రత ఉంటుంది. సాయంత్రం ఆకాశం మేఘావృతం అవుతుంది. ఈదురు గాలులు వీస్తాయి. అక్కడక్కడ జల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

అటవీ సిబ్బందిపై దాడి హేయమైన చర్య



ఇందల్వాయి : మోపాల్ మండలం కాల్పోల్‌లో ఫారెస్టు సిబ్బందిపై గ్రామస్తులు దాడి చేయడం హేయమైన చర్య అని బాసర యూనిట్ రేంజ్ అధికారుల అసోసియేషన్ ఉపాధ్యక్షుడు, ఇందల్వాయి రేంజ్ అధికారి రవిమోహన్ భట్ అన్నారు. ఇందల్వాయి రేంజ్ కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. నిందితులపై పీడీయాక్ట్ నమోదు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాన్నారు.

విధుల్లో నిర్లక్ష్యంగా ఉండొద్దు



మోపాల్ : ఉపాధ్యాయులు విధుల్లో నిర్లక్ష్యంగా ఉండొద్దని జిల్లా విద్యాశాఖ అధికారి దుర్గాప్రసాద్ అన్నారు. శుక్రవారం నగర శివారులోని బోర్గాం(పి) జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ప్రార్థన సమయంలో డీఈవో సందర్శించారు. ఉపాధ్యాయులపై ఏమైనా ఫిర్యాదులు వస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. బోర్గాం (పి) పాఠశాలకు జిల్లాలోనే ప్రత్యేక స్థానం ఉందన్నారు. విద్యార్థులు మంచిగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. అనంతరం ఎన్ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌కు ఎంపికైన ముగ్గురు విద్యార్థులను డీఈవో అభినందించారు. హెచ్ఎం శంకర్, ఉపాధ్యాయులు ఉన్నారు.

ఎస్సారెస్పీలోకి స్వల్ప ఇన్‌ఫ్లో

బాల్కొండ : శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి ఎగువ ప్రాంతాల నుంచి స్వల్పంగా వరద నీరు వచ్చి చేరుతోంది. స్థానిక ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలతో 1157 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. ప్రాజెక్ట్ నుంచి సరస్వతి కాలువ ద్వారా 10 క్యూసెక్కులు, మిషన్ భగీరథ ద్వారా 231 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 245 క్యూసెక్కుల నీరు పోతోంది. శుక్రవారం సాయంత్రానికి ప్రాజెక్ట్‌లో 1056.70 (7.56 టీఎంసీలు) అడుగుల నీరు నిల్వ ఉందని ప్రాజెక్ట్ అధికారులు తెలిపారు.

క్షయవ్యాధి నివారణకు కృషి చేయాలి



డిచ్‌పల్లి : వైద్య ఆరోగ్య సిబ్బంది, ఆశవర్కర్లు గ్రామీణ ప్రాంత ప్రజలను చైతన్యం చేసి క్షయవ్యాధి నివారణకు కృషి చేయాలని జిల్లా వయోజన బీసీజీ టీకా పర్యవేక్షణ అధికారి సంతోష్ సూచించారు. శుక్రవారం డిచ్‌పల్లిలోని సామాజిక ఆరోగ్య కేంద్రం (సీహెచ్‌సీ)లో ఆరోగ్య కార్యకర్తలు, ఆశవర్కర్లు, ఎంఎల్‌హెచ్‌పీలకు వయోజన బీసీజీ టీకా కార్యక్రమంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ సంతోష్ మాట్లాడుతూ.. 60 ఏళ్లు పైబడిన వారందరికీ బీసీజీ వ్యాక్సిన్ ఇస్తారని తెలిపారు. 18 ఏళ్ల వయసు పైబడి పొగ తాగే అలవాటు ఉన్న వారు, గతంలో టీబీ వ్యాధిగ్రస్తులు, ఐదేళ్ల క్రితం టీబీ మందులు వాడిన వారు, టీబీ వ్యాధిగ్రస్తులతో సన్నిహిత సంబంధం ఉన్న వారందరి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ఇందుకోసం ఆశవర్కర్లు ఇంటింటి సర్వే నిర్వహించాలని ఆదేశించారు. జిల్లా టీబీ కో-ఆర్డినేటర్ రవికుమార్, పర్యవేక్షకురాలు స్రవంతి, ఆరోగ్య విస్తరణ అధికారి శంకర్, ఆరోగ్య పర్యవేక్షణ అధికారి అక్బర్ అలీ పాల్గొన్నారు.

దరఖాస్తుల పరిశీలన

నిజామాబాద్‌నాగారం : జిల్లా వైద్యారోగ్య శాఖలో ఖాళీగా ఉన్న పోస్టులకు గతంలో వచ్చిన దరఖాస్తులను డీఎంహెచ్‌వో తుకారాం రాథోడ్ ఆధ్వర్యంలో పరిశీలిస్తున్నారు. ఏడు స్టాఫ్ నర్స్, మూడు ఏఎన్ఎం, ఆరు ఫార్మసిస్ట్ పోస్టులకు వచ్చిన దరఖాస్తులు పరిశీలిస్తున్నారు. ఈ నెలాఖరు నాటికి మెరిట్ జాబితా సిద్ధం చేయనున్నారు.

అటవీ అధికారులపై దాడి

- కాల్పోల్‌లో ఫారెస్ట్ భూమి చదునును అడ్డుకున్నందుకు..
- ఎఫ్ఆర్‌వో, సెక్షన్, బీట్ అధికారులకు గాయాలు
- 30 మందిపై కేసు నమోదు
- నిందితుల కోసం గాలింపు!



గాయపడ్డ అధికారులు

అటవీ శాఖ అధికారులపై దాడి ఘటన జిల్లాలో కలకలం రేపింది. మోపాల్ మండలం కాల్పోల్‌లో ఫారెస్ట్ భూమి దున్నడాన్ని అడ్డుకునేందుకు వెళ్లిన సిబ్బందిపై గ్రామస్తులు దాడి చేశారు. ఈ ఘటనను ఆ శాఖ అధికారులు తీవ్రంగా ఖండించారు.



గాయపడ్డ అటవీ అధికారులను పరామర్శిస్తున్న ఎఫ్‌డీవో సుధాకర్‌రావు

మోపాల్(నిజామాబాద్‌రూరల్) : మోపాల్ మండలంలోని కాల్పోల్ గ్రామంలో ట్రాక్టర్‌తో అటవీ భూమిని దున్నుతుండగా అడ్డుకునేందుకు యత్నించిన ఫారెస్ట్ అధికారులపై గ్రామస్తులు శుక్రవారం దాడికి పాల్పడ్డారు. గ్రామస్తులు, పోలీసులు, అటవీశాఖ అధికారుల కథనం ప్రకారం.. కాల్పోల్ గ్రామానికి చెందిన మోతీలాల్ కుటుంబం అటవీ భూమిని ట్రాక్టర్‌తో దున్నుతుంది. విషయం తెలుసుకున్న నిజామాబాద్ సౌత్ ఎఫ్ఆర్‌వో రాధిక ఆధ్వర్యంలో సెక్షన్ ఆఫీసర్ సాయికృష్ణ, బీట్ ఆఫీసర్ ప్రగత్‌కుమార్, ప్రసాద్, బేస్ క్యాంపు సిబ్బంది అక్కడికి చేరుకున్నారు. అటవీ భూమిని ఎందుకు దున్నుతున్నారని ప్రశ్నించడంతో వారి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. మోతీలాల్ కుటుంబం గ్రామస్తులకు ఫోన్ చేయడంతో సుమారు 40 మంది వరకు అక్కడికి చేరుకున్నారు. పరిస్థితి అదుపు తప్పే అవకాశముందని గ్రహించిన రాధిక స్థానిక పోలీసులకు సమాచారమిచ్చారు. వీడియో చిత్రీకరిస్తుండగా ఎఫ్ఆర్‌వోతోపాటు అటవీ శాఖ సిబ్బంది ఫోన్లను గ్రామస్తులు లాక్కున్నారు. ట్రాక్టర్‌ను పట్టుకునేందుకు యత్నించిన ఎఫ్ఆర్‌వో, సెక్షన్ ఆఫీసర్ సాయికృష్ణపై దాడికి పాల్పడ్డారు. సుమారు 200 మీటర్ల వరకు రాధికను వెంబడించారు. ఈ దాడిలో ఎఫ్ఆర్‌వో రాధిక, సెక్షన్ ఆఫీసర్ సాయికృష్ణ, బీట్ ఆఫీసర్ ప్రగత్ కుమార్ చేతులకు బలమైన గాయాలయ్యాయి.

పోలీసుల రాకతో పరారీ!

దాడిపై సమాచారం అందుకున్న సీఐ సురేష్‌కుమార్, ఎస్సై గంగాధర్ పోలీసులు, ప్రత్యేక బలగాలతో ఘటనా స్థలానికి చేరుకున్నారు. వారి రాకను గమనించిన గ్రామస్తులు, గిరిజనులు అక్కడి నుంచి పరారయ్యారు. ఘటనా స్థలంలో ఉన్న వారిని అదుపు చేసే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో మహిళలు, గ్రామస్తులతో వాగ్వివాదం చోటుచేసుకుంది. ఏసీపీ రాజా వెంకట్‌రెడ్డి అక్కడికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. దాడి వెనక ఎవరెవరు ఉన్నారు.. దాడిలో ఎంతమంది పాల్గొన్నారు అనే విషయాలపై ఆరా తీశారు. ఫారెస్ట్ అధికారుల ఫోన్లను తిరిగి ఇప్పించారు.

పోలీసులకు ఫిర్యాదు



గాయపడ్డ రాధిక

అటవీశాఖ అధికారులు తమపై దాడికి పాల్పడిన కాల్పోల్ గ్రామస్తులు, గిరిజనులపై పోలీసులకు ఫిర్యాదుచేశారు. తనతోపాటు సిబ్బందిపై హత్యాయత్నానికి పాల్పడ్డారని ఎఫ్ఆర్‌వో ఫిర్యాదు మేరకు సుమారు 30మందిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ప్రధానంగా మోతీలాల్‌తో పాటు ఆయన భార్య, తల్లి, రతీయ, హీరాలాల్, బర్మల్ అన్న, గణేష్, బాలు, తదితరులు ఉన్నట్లు గుర్తించారు. ఇన్‌చార్జి డీఎఫ్‌వో వెంకటేశ్వర్‌రావు, ఎఫ్‌డీవో సుధాకర్‌రావు ఠాణాకు చేరుకుని పరిస్థితిని పోలీస్ అధికారులకు వివరించారు. దాడికి పాల్పడి పరారైన నిందితుల కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.

కరువైన రక్షణ..

- ప్రాణాల మీదికి వస్తున్న పోడు భూముల వ్యవహారం
- ఫారెస్టు శాఖలో కలకలం రేపిన కాల్పోల్ ఘటన
- నేడు జిల్లా కేంద్రంలో నిరసన ర్యాలీ!



కాల్పోల్‌లో దాడికి యత్నిస్తున్న గ్రామస్తులు

డొంకేశ్వర్(ఆర్మూర్) : అటవీ అధికారులకు రక్షణ కరువైంది. అటవీ ప్రాంతాల్లో డ్యూటీ చేయడానికి వెళ్తే ప్రాణాలతో తిరిగి వస్తారని అనే గ్యారంటీ లేకుండా పోయింది. జిల్లాలో ఫారెస్టు అధికారులు, సిబ్బందిపై జరుగుతున్న వరుస దాడులు కలవరపెడుతున్నాయి. శుక్రవారం మోపాల్ మండలం కాల్పోల్ అటవీ ప్రాంతంలో జరిగిన ఘటన అటవీ శాఖను కుదిపేసింది. అడవుల్లోకి వెళ్లి పని చేయాలంటేనే సిబ్బంది జంకుతున్నారు. ప్రధానంగా పోడు భూముల వ్యవహారం ప్రాణాల మీదకు తెస్తోంది. భూములను కాపాడేందుకు వెళ్తే అక్కడున్న వ్యక్తులు ఏకంగా దాడులు చేస్తున్నారు. గత ప్రభుత్వం పోడు భూములకు పట్టాలిచ్చింది. తమకు కూడా ప్రభుత్వం పట్టాలు ఇస్తుందనే ఉద్దేశంతో పట్టాలు రానివారితో పాటు కొత్త వారు కూడా పోడు భూములను దున్నుతున్నారు. ముఖ్యంగా నిజామాబాద్ రూరల్, బాల్కొండ, బాన్సువాడ నియోజకవర్గాల్లో అటవీ భూములు ఎక్కువగా అన్యాక్రాంతం అవుతున్నాయి. ఈ ప్రాంతాల్లో అటవీ భూములను కాపాడడంతో ఫారెస్టు సిబ్బందికి కత్తిమీద సాములా మారింది. అటవీ అధికారులకు రక్షణ కల్పించడంలో అలాగే ఆయుధాలు ఇచ్చే విషయంలో ఏ ప్రభుత్వాలు కూడా చర్యలు చేపట్టడం లేదు.

పదేళ్ల క్రితం ఎఫ్ఆర్వో గంగయ్య హత్య

ఇందల్వాయి రేంజ్ అధికారిగా పని చేసిన గంగయ్య హత్య ఘటనను ఫారెస్టు అధికారులు ఇప్పటికీ మర్చిపోలేకపోతున్నారు. 2013లో పోడు భూములను కాపాడేందుకు రాత్రి సమయంలో వెళ్లిన గంగయ్యను అక్కడున్న వ్యక్తులు కళ్లలో కారం చల్లి గొడ్డలితో నరికి చంపారు. గంగయ్య హత్య తర్వాత ఇందల్వాయి రేంజ్‌కు ఎఫ్ఆర్వోగా పని చేసిన వారికి గన్‌మెన్లను ఇచ్చింది ప్రభుత్వం. ఇప్పుడు ఏ ఫారెస్టు అధికారికి కూడా పోలీసు రక్షణ, ఆయుధాలు లేని పరిస్థితి ఉంది. కమ్మర్‌పల్లి, ఇందల్వాయి, వర్ని, భీమ్‌గల్, మాక్లూర్ ప్రాంతాల్లో కూడా బీట్ ఆఫీసర్లపై దాడులు జరిగిన ఘటనలున్నాయి. కాల్పోల్ ఘటనకు నిరసనగా అటవీ శాఖ ఉద్యోగులు శనివారం విధులను బహిష్కరించి డీఎఫ్‌వో కార్యాలయం నుంచి ర్యాలీ తీయనున్నట్లు తెలిసింది. సీపీని కలిసి వినతి పత్రం అందజేయనున్నారని సమాచారం.

పరామర్శ

దాడిలో గాయపడ్డ ఎఫ్ఆర్‌వో రాధిక, సెక్షన్ అధికారి సాయికృష్ణ, ప్రగత్‌కుమార్‌ను ఇన్‌చార్జి డీఎఫ్‌వో వెంకటేశ్వర్‌రావు, ఎఫ్‌డీవో సుధాకర్‌రావు, అసోసియేషన్ నాయకులు ఆస్పత్రిలో పరామర్శించారు. దాడులను వారు తీవ్రంగా ఖండించారు. నిందితులను గుర్తించి కఠినచర్యలు తీసుకోవాలని, మరోసారి దాడులు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు. దాడికి గల కారణాలు తెలుసుకుని ఉన్నతాధికారులకు నివేదించారు.

'ధరణి' దరఖాస్తులు పరిష్కరించాలి



వీసీలో పాల్గొన్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, అధికారులు

- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

సుభాష్‌నగర్ : ధరణి పెండింగ్ దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు ఆదేశించారు. రాష్ట్ర భూ పరిపాలనా విభాగం ప్రధాన కమిషనర్ నవీన్ మిట్టల్ శుక్రవారం వీడియో కాన్ఫరెన్సు ద్వారా ధరణి పెండింగ్ దరఖాస్తులు, ప్రజావాణిలో భూ సంబంధిత అంశాలపై వచ్చిన అర్జీలపై చేపట్టిన చర్యలు తదితర అంశాలపై కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, రెవెన్యూ అధికారులతో సమీక్ష నిర్వహించారు. వీసీ ముగిసిన అనంతరం కలెక్టర్ రెవెన్యూ డివిజనల్ అధికారులు, తహసీల్దార్లతో సమావేశమై కీలక సూచనలు చేశారు. ధరణిలో వివిధ మాడ్యూల్స్ కింద దాఖలైన దరఖాస్తులను తక్షణమే పరిశీలిస్తూ, యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. ఆయా దరఖాస్తులకు సంబంధించి ఇప్పటికే క్షేత్రస్థాయి పరిశీలన పూర్తయిన వాటిని మూడు, నాలుగు రోజుల్లో పరిష్కరించాలని, ఏ ఒక్క దరఖాస్తు కూడా పెండింగ్‌లో లేకుండా చూడాలన్నారు. బోధన్ తహసీల్ కార్యాలయ పరిధిలో ఎక్కువ సంఖ్యలో ధరణి దరఖాస్తులు అపరిష్కృతంగా ఉన్నాయని, సత్వరమే వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత ఆర్డీవో, తహసీల్దార్లను ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాతో ముడిపడిన అర్జీలను కూడా వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. అర్జీలపై చేపట్టిన చర్యల గురించి దరఖాస్తుదారునికి వివరాలు తెలియజేయడంతో పాటు, ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో పొందుపర్చాలన్నారు. ప్రజావాణి పెండింగ్ దరఖాస్తుల పరిష్కారం కోసం చేపడుతున్న చర్యలకు సంబంధించి రోజువారీగా తనకు నివేదికలు సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు.

వీసీలో అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, ఆర్డీవోలు రాజేంద్రకుమార్, రాజాగౌడ్, రాజేశ్వర్, కలెక్టరేట్ ఏవో ప్రశాంత్, తహసీల్దార్లు పాల్గొన్నారు.

ఆర్‌వోబీ పనులపై నజర్

- మాధవనగర్, అడవిమామిడిపల్లి, మామిడిపల్లి, అర్సపల్లిల్లో నిర్మాణాలు
- త్వరగా అందుబాటులోకి తెచ్చేందుకు ఎంపీ అర్వింద్ ప్రయత్నాలు



నిర్మాణంలో ఉన్న అడవి మామిడిపల్లి ఆర్‌వోబీ



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : జిల్లాలోని రైల్వే ఓవర్ బ్రిడ్జిల పనులన్నింటినీ పూర్తి చేసి ప్రజలకు సాధ్యమైనంత త్వరగా అందుబాటులోకి తెచ్చేందుకు గాను ఎంపీ ధర్మపురి అర్వింద్ ప్రత్యేకంగా దృష్టి సారించారు. ఢిల్లీలో ఉన్న అర్వింద్ అక్కడి నుంచే ఈ పనుల గురించి ఆరా తీస్తున్నారు. తనను రెండోసారి గెలిపించడంతో పాటు కేంద్రంలో వరుసగా మూడోసారి నరేంద్రమోదీ ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకురావడంలో ఇందూరు పార్లమెంట్ ప్రజలు తిరుగులేని మద్దతు ఇచ్చారని ఎంపీ భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం కేటాయించిన నిధులతో చేపట్టిన పనులను త్వరగా పూర్తి చేయించాలని ఎంపీ ప్రణాళికలు రచిస్తున్నారు.



పిల్లర్ల స్థాయిలో మాధవనగర్ ఆర్‌వోబీ పనులు

- గతేడాది ప్రారంభించిన నిజామాబాద్–హైదరాబాద్ రోడ్డులోని మాధవనగర్ రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులు కొద్దిరోజుల క్రితం ఆగిపోయాయి. ఈ ఏడాది చివరిలోగా పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలనే దిశగా ఎంపీ రైల్వే, ఆర్ అండ్‌బీ అధికారులను ఆదేశించారు. పనులను తక్షణమే పున:ప్రారంభించేందుకు ఎంపీ ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం పిల్లర్ల దశలో మాధవనగర్ ఆర్‌వోబీ పనులు ఆగిపోయాయి.
- ఆర్మూర్ వద్ద మామిడిపల్లి ఆర్‌వోబీ పనులను రెండు నెలల్లో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తెచ్చేందుకు ఎంపీ ప్రయత్నాలు చేస్తున్నారు. మరో వైపు నిజామాబాద్–ఆర్మూర్ మధ్యలో మాక్లూర్ మండలం అడవిమామిడిపల్లి వద్ద ఆర్‌వోబీ పనులు ఐదేళ్ల కిందట ప్రారంభమైనప్పటికీ నిదానంగా నడుస్తున్నాయి. ఎంపీ అనేకసార్లు హెచ్చరించినప్పటికీ కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగా ముందుకు పడలేదు. ఈ పనులను ఏడాది చివరిలోగా పూర్తి చేయాలని ఎంపీ లక్ష్యంగా పెట్టుకున్నారు.
- నిజామాబాద్–బోధన్ రోడ్డులో అర్సపల్లి వద్ద రూ.137 కోట్ల పూర్తి కేంద్ర ప్రభుత్వ నిధులతో మంజూరైన ఆర్‌వోబీ పనులను వేగంగా పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఎంపీ ఆదేశించారు. అదేవిధంగా బోధన్ వద్ద సైతం మంజూరైన ఆర్‌వోబీ పనులను త్వరగా పూర్తి చేయించడంపై ఎంపీ నజర్ పెట్టారు. నవీపేట వద్ద చేపట్టిన రైల్వే అండర్ బ్రిడ్జి పనులను సైతం వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.
- ఆర్మూర్ గోవింద్‌పేట ఆర్‌వోబీ ప్రజలకు అందుబాటులోకి వచ్చింది. ఈ క్రమంలో ఎంపీ అర్వింద్ ఢిల్లీలో ఉండగానే పెండింగ్‌లో ఉన్న రైల్వే పనులకు సంబంధించి అధికారులతో మాట్లాడి పనులు వేగంగా జరిగేలా ఆదేశాలు ఇస్తున్నారు.

నెరవేరనున్న ఏళ్ల కల

- భాషా పండితులకు స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతి
- ఎస్జీటీల పిటిషన్ కొట్టేసిన సుప్రీంకోర్టు



పదోన్నతులకోసం దీక్ష చేపట్టిన భాషాపండితులు (ఫైల్)

నిజామాబాద్ అర్బన్ : ఏళ్లుగా ఎదురు చూస్తున్న భాషా పండితులు, పీఈటీల కల ఎట్టకేలకు నెరవేరనుంది. ఉన్నత పాఠశాలలో తరగతులు బోధిస్తూ ప్రాథమిక స్థాయి ఎస్జీటీలకు సమానమైన వేతనాన్ని పొందుతున్న భాషా పండితులకు ఎట్టకేలకు పదోన్నతులు లభించనున్నాయి. తమకు జరుగుతున్న అన్యాయంపై భాషా పండితులు ఏళ్లుగా పోరాటం చేస్తున్నారు. నిరాహార దీక్షలు, సహాయ నిరాకరణ, విద్యాధికారులపై ఒత్తిడి, కోర్టులలో పిటిషన్లు వేస్తూ పదోన్నతుల కోసం పోరాడారు. కొత్తగా ఏర్పాటైన కాంగ్రెస్ సర్కార్‌కు తమ గోడు వెళ్లబోసుకోగా స్పందించిన ప్రభుత్వం ప్రమోషన్లు కల్పించాలని నిర్ణయించింది. దీనిపై ఎస్జీటీలు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. వారి పిటిషన్‌ను శుక్రవారం కోర్టు కొట్టి వేయడంతో భాషా పండితుల పదోన్నతులు వారికే లభించనున్నాయి.

జిల్లాలో 454 మంది..

జిల్లాలో 454 మంది భాషా పండితులకు పదోన్నతి లభించనుంది. ఇందుకు సంబంధించి విద్యాశాఖ మంజూరు చేసిన పోస్టుల ఆధారంగా అర్హులను గుర్తించారు. వీరిలో తెలుగు పండతులు 226 మంది, హిందీ 200, ఉర్దూ 28 మంది ఉన్నారు. వీరితో పాటు వ్యాయామ ఉపాధ్యాయులు పదోన్నతి పొందనున్నారు. జిల్లాలో 93 మంది పీఈటీలకు ప్రమోషన్ లభించనుంది. వీరి ధ్రువపత్రాల పరిశీలన ఇప్పటికే పూర్తయింది. వెబ్ ఆప్షన్‌లు ఇచ్చి ప్రక్రియ పూర్తి చేసే అవకాశం ఉంది. మరో రెండు రోజుల్లో ఈ ప్రక్రియ చేపట్టి పదోన్నతులు కల్పించనున్నారు.

"ఎన్నో పోరాటాలు చేశాం



భాషా పండితుల పదోన్నతుల కోసం కొన్నేళ్లుగా పోరాటాలు చేశాం. ఉన్నతాధికారులను కలిసి సమస్యను విన్నవించాం. చివరకు కోర్టును ఆశ్రయించగా మాకు న్యాయం జరిగింది.

– జమీలుల్లా, రాష్ట్రీయ పండిత పరిషత్ జిల్లా అధ్యక్షుడు

వెలవెలబోతున్న వరద కాలువ

బాల్కొండ : శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ వరద కాలువలో ప్రస్తుతం నీరు లేక వెలవెలబోతుంది. దీంతో వరద కాలువ నీటి ఆధారంగా మోటార్లను ఏర్పాటు చేసుకున్న రైతులు ఆందోళన చెందుతున్నారు. వరద కాలువలో రివర్స్ పంపింగ్ ద్వారా నీటిని నింపి నిల్వ ఉంచే వారు. లేదంటే ప్రాజెక్ట్‌లో 1075 అడుగుల కంటే ఎక్కువ నీరు ఉంటే వరద కాలువకు వదిలి నిల్వ ఉంచే వారు. ప్రస్తుతం కాళేశ్వరంలో నీరు లేదు. ఎస్సారెస్పీ నుంచి నీటిని విడుదల చేద్దామంటే అంత స్థాయిలో నీటి మట్టం లేదు. దీంతో కాలువ నీరు లేక వెలవెలబోతుంది. వరద కాలువ నీటి ఆధారంగా మోటార్లు బిగించి సాగు చేసిన పంటలకు నీరు అందడం లేదు. ఎస్సారెస్పీ పునరుజ్జీవన పథకంలో కాళేశ్వరం నీళ్లు తీసుకురావడానికి వరద కాలువ కీలకం. గతేడాది జూలైలో వరద కాలువ ద్వారా రివర్స్ పంపింగ్‌తో కాళేశ్వరం నీళ్లను ప్రాజెక్ట్‌కు తరలించారు. ప్రస్తుతం ఆ పరిస్థితి కనిపించడం లేదు. కాళేశ్వరం కుంగిపోవడం, మేడిగడ్డ బ్యారేజీలను ఖాళీ చేయడంతో రివర్స్ పంపింగ్ ద్వారా నీటిని సరఫరా చేసే అవకాశం లేదు. వరద కాలువ ఆధారంగా 9300 ఎకరాల ఆయకట్టుకు జిల్లాలో స్థిరీకరించారు.



నీరు లేక బోసిపోయిన వరద కాలువ

క్లుప్తంగా

డిగ్రీ పరీక్షలకు 29 మంది గైర్హాజరు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో కొనసాగుతున్న డిగ్రీ సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ పరీక్షలకు శుక్రవారం 29 మంది గైర్హాజరైనట్లు అకడమిక్ ఆడిట్ సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఘంటా చంద్రశేఖర్ తెలిపారు. ఉదయం నిర్వహించిన 5వ సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షకు 83 మందికి 73 మంది హాజరు కాగా 10 గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం నిర్వహించిన 2వ సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షకు 369 మందికి 350 మంది హాజరు కాగా 19 మంది గైర్హాజరైనట్లు ఆయన పేర్కొన్నారు.

ఐసెట్‌లో జిల్లా వాసికి 461 ర్యాంకు


అనీష్

నిజామాబాద్అర్బన్: జిల్లా కేంద్రానికి చెందిన దాత్రిక రమేశ్ రాజలక్ష్మి ల కుమారుడు అనీష్ ఐసెట్‌లో 461 ర్యాంకు సాధించారు. శుక్రవారం వెలువడిన ఐసెట్ ఫలితాల్లో అతను ఈ ర్యాంకు సాధించాడు. అనీష్ 461 ర్యాంకు సాధించడంపై తల్లితండ్రులు, కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నెమలికి తీవ్రగాయాలు



నందిపేట్: విద్యుదాఘాతానికి గురైన నెమలికి తీవ్రగాయాలైన ఘటన మండలంలోని చింరాజ్‌పల్లి శివారులో శుక్రవారం చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. చింరాజ్‌పల్లి ఎంపీటీసీ వ్యవసాయ క్షేత్రంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌పై నెమలి వాలింది. ఈ క్రమంలో విద్యుత్ సరఫరా జరిగి కింద పడిపోయింది. విషయాన్ని గమనించిన ఎంపీటీసీ అటవీశాఖ అధికారి సుధాకర్‌కు ఫోన్‌లో సమాచారం అందించారు. వారు వచ్చి చూడగా కాలికి తీవ్రగాయమైనట్లు గుర్తించి స్థానికుల సహాయంతో వెటర్నరీ కార్యాలయానికి తరలించారు. వెటర్నరీ అధికారి హన్మంత్‌రెడ్డి నెమలికి చికిత్స చేశారు. ప్రస్తుతం నెమలి బాగానే ఉన్నందున మాక్లూర్ మండలం చిన్నాపూర్‌లో ఉన్న అర్బన్ పార్కులో విడిచిపెట్టినట్లు అటవీశాఖ అధికారి సుధాకర్ తెలిపారు.

బ్రోచర్ ఆవిష్కరణ

నిజామాబాద్‌నాగారం: జిల్లా కేంద్రంలో ఈ నెల 22న ఇండియన్ సైకియాట్రిక్ సొసైటీ తెలంగాణ స్టేట్ బ్రాంచ్ ఆధ్వర్యంలో 'అడిక్షన్ సైకియాట్రిక్' అనే అంశంపై జాతీయస్థాయిలో నిర్వహించే సదస్సు బ్రోచర్‌ను రాష్ట్ర వైద్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ హైదరాబాద్‌లోని తన కార్యాలయంలో శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డ్రగ్స్ నిర్మూలనపై యువతలో సామాజిక చైతన్యం, అవగాహన కల్పించడానికి నిజామాబాద్‌లో నిర్వహిస్తున్న ఈ జాతీయ స్థాయి సదస్సు విజయవంతం కావాలని ఆకాంక్షించారు. మంత్రిని కలిసిన వారిలో ఇండియన్ సైకియాట్రిక్ సొసైటీ రాష్ట్ర బ్రాంచ్ జనరల్ సెక్రటరీ విశాల్ ఆకుల, వైద్యులు ఉమాశంకర్, జార్జిరెడ్డి, ఫనికాంత్, రవితేజ ఇన్నమూరి, అశోక్ అలిమ్ చందాని తదితరులు పాల్గొన్నారు.

అప్పుల బాధతో ఒకరి ఆత్మహత్య


నరేశ్ (ఫైల్)

భీమ్‌గల్: అప్పుల బాధతో ఒకరు ఆత్మహత్య చేసుకున్న ఘటన భీమ్‌గల్ పట్టణ కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్సై హరిబాబు శుక్రవారం తెలిపిన వివరాల ప్రకారం.. భీమ్‌గల్‌కు చెందిన మేడం నరేశ్(50)కు కూలీ పనులు చేస్తూ జీవిస్తున్నాడు. ఈ క్రమంలో చేసిన అప్పులు ఎక్కువ కావడంతో మనస్తాపానికి చెందిన నరేశ్ ఈ నెల 12న ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబీకులు పలు చోట్ల గాలించినా ఆచూకీ లభించలేదు. గ్రామ శివారులోని అడ్డగుట్ట ప్రాంతంలో చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

వేగంగా 'ఆస్పత్రి' పనులు

- ధర్పల్లిలో కొనసాగుతున్న వంద పడకల ఆస్పత్రి నిర్మాణం
- భవనం పూర్తయితే అందనున్న మెరుగైన వైద్య సేవలు
- ప్రజలకు తప్పనున్న తిప్పలు


కొనసాగుతున్న ఆస్పత్రి నిర్మాణ పనులు

ధర్పల్లి: ప్రతి నియోజకవర్గంలో వంద పడకల ఆస్పత్రిని నిర్మించి పల్లె ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే సంకల్పంతో గత ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఇందులో భాగంగానే రూరల్ నియోజకవర్గంలోని ధర్పల్లిలో 30 పడకలుగా ఉన్న సామాజిక ఆరోగ్య కేంద్రం(సీహెచ్‌సీ) వైద్య విధాన పరిషత్ పరిధిలోకి వెళ్లింది. దీంతో వంద పడకల ఆస్పత్రి భవన నిర్మాణ పనులకు మూడు నెలల క్రితం శంకుస్థాపన చేశారు. ప్రస్తుతం పనులు వేగవంతంగా కొనసాగుతున్నాయి.

ఇన్‌చార్జి వైద్యునితోనే సేవలు

ధర్పల్లి, సిరికొండ మండలాల ప్రజలకు వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావాలని 1986లో నాటి ప్రభుత్వం ధర్పల్లిలో 30 పడకల ఆస్పత్రిని నిర్మించి ఒక జనరల్ సర్జన్ వైద్యుడిని నియమించింది. నాటి నుంచి ఆస్పత్రిలో వివిధ రకాల శస్త్ర చికిత్సలు అందుబాటులోకి వచ్చాయి.

ఇప్పటికీ రోజుకు వందమంది రోగులను వైద్యులు పరీక్షిస్తారు. ఈ ఆస్పత్రిలో ఇద్దరు జనరల్ సర్జన్, స్త్రీ వైద్య నిపుణులు, పిల్లల డాక్టర్, మత్తు డాక్టర్ ఉండాలి. కానీ కేవలం ఇన్‌చార్జి జనరల్ సర్జన్‌తోనే ప్రస్తుతం ఆస్పత్రి కొనసాగుతోంది. గత ప్రభుత్వం గ్రామ ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించాలనే ఉద్దేశంతో 30 పడకల ఆస్పత్రిని వంద పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేస్తూ గత ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

నాలుగు మండలాలకు మేలు

వంద పడకల ఆస్పత్రి నిర్మాణానికి గత ప్రభుత్వం రూ.33.15 కోట్లు మంజూరు చేసింది. తహసీల్ కార్యాలయం వెనుక ఉన్న స్థానంలో నిర్మాణానికి అధికారులు ప్రతిపాదించగా నాటి వైద్య మంత్రి హరీశ్ రావు, నాటి రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ భూమి పూజ చేశారు. కానీ పాత ఆస్పత్రి భవన స్థలం 5 ఎకరాల వరకు ఉండడంతో అక్కడే నిర్మించాలని ప్రస్తుత ఎమ్మెల్యే భూపతిరెడ్డి అధికారులను ఆదేశించారు. దీంతో అధికారులు మూడు నెలల క్రితం భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. ఈ పనులు పూర్తయి వైద్య సేవలు అందుబాటులోకి తీసుకువస్తే రూరల్ నియోజకవర్గంలోని ధర్పల్లి, సిరికొండ, జక్రాన్‌పల్లి, ఇందల్వాయి మండలాల ప్రజలకు 30 రకాల వైద్య సేవలు అందుబాటులోకి రానున్నాయి. మాతా శిశు, జనరల్ సర్జన్‌తో పాటు వివిధ రకాల వైద్యులు, ల్యాబ్ సేవలు, ఎక్స్‌రేలు వంటివి కేటాయించనున్నారు. వీటితోపాటు మార్చురీ గది, బ్లడ్ బ్యాంక్ సేవలు అందుబాటులోకి వస్తాయి. ఈ భవనం అందుబాటులోకి వస్తే ప్రజలకు కార్పొరేట్ వైద్యం అందనుంది. పనులు వేగంగా కొనసాగుతుండడంపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

క్రైం కార్నర్

అనుమానాస్పద స్థితిలో ఒకరి మృతి


మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై

భిక్కనూరు: అనుమానాస్పద స్థితిలో ఒకరు మృతి చెందిన ఘటన మండలంలోని జంగంపల్లి శివారులో చోటు చేసుకుంది. ఎస్సై సాయికుమార్ శుక్రవారం తెలిపిన వివరాల ప్రకారం.. రాజంపేట మండల కేంద్రానికి చెందిన పాముల రాజేందర్(45) ఈనెల 11న కామారెడ్డి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తన తండ్రికి అవసరమైన రక్తాన్ని ఇచ్చి ఖర్చులకు అవసరమైన డబ్బులు లేవని తన సోదరి మంజులకు చెప్పి ఆస్పత్రి నుంచి బయటకు వచ్చాడు. తిరిగి కనిపించకపోవడంతో కుటుంబీకుల పలు చోట్ల వెతికినా ఆచూకీ లభించలేదు. శుక్రవారం జంగంపల్లి శివారులోని కోళ్ల షెడ్ సమీపంలో మృతదేహం ఉందన్న స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. విచారణలో రాజేందర్ మృతదేహంగా గుర్తించారు. మృతుడి భార్య గోదావరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

గుండెపోటుతో కాంగ్రెస్ సీనియర్ నేత మృతి


ఖలీల్ (ఫైల్)

బోధన్: మండలంలోని కొప్పర్గకు చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు సయ్యద్ ఖలీల్ పటేల్ (65) గురువారం అర్ధరాత్రి గుండె పోటుతో మృతి చెందాడు. స్వగ్రామంలో శుక్రవారం అంత్యక్రియలు నిర్వహించారు. నియోజకవర్గంలోని వివిధ పార్టీల నాయకులు, గ్రామస్తులు అంత్యక్రియలకు హాజరయ్యారు. నివాళులు అర్పించిన వారిలో వైస్ ఎంపీపీ కోట గంగారెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ గిర్దావర్ గంగారెడ్డి, మాజీ ఎంపీపీ గంగాశంకర్, మున్సిపల్, ఏఎంసీ మాజీ చైర్మన్లు మహ్మద్ గౌసొద్దీన్, పాషామొహినొద్దీన్, నాయకులు గణపతి రెడ్డి, అల్లె రమేశ్, మందర్న రవి, కేజీ గంగారాం, భయ్యన్ సురేశ్ పటేల్, శ్రీనివాస్ రెడ్డి తదితరులు ఉన్నారు.

మద్యానికి బానిసై యువకుడి మృతి



పిట్లం: మద్యానికి బానిసై యువకుడు మృతి చెందిన ఘటన మండలంలోని మారేడు గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్సై నీరేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కాశీరాం(29) ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. కొంత కాలంగా మద్యానికి బానిసయ్యాడు. మద్యం తాగొద్దని కుటుంబీకులు చెప్పినా వినిపించుకోలేదు. ఈ నెల 13న తన ఆటోలో పిట్లం వెళ్లి వస్తానని చెప్పి ఇంటి నుంచి వెళ్లాడు. పిట్లంలో ఉన్న సాయిగార్డెన్ వెనుకాల ఉన్న ప్రాంతంలో మద్యం అతిగా తాగడంతో మృతి చెందాడు. మృతుడి భార్య లావణ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. మృతుడికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి


నిమ్మ శంకర్ మృతదేహం

నిజామాబాద్‌రూరల్: ఖానాపూర్‌లోని అంబేడ్కర్ కాలనీకి చెందిన నిమ్మ శంకర్(68) అనే రైతు శుక్రవారం విద్యుదాఘాతంతో మృతిచెందినట్లు రూరల్ ఎస్‌హెచ్‌వో మహేశ్‌కుమార్ శుక్రవారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. శంకర్ గత ఆరేళ్లుగా ఖానాపూర్ శివారులో భూమిని కౌలుకు తీసుకొని వ్యవసాయం చేస్తున్నాడు. గురువారం ఉదయం 9 పొలం వద్దకు వెళ్లి స్టార్ బాక్సు వద్ద కట్ అయిన వైర్‌కు టేపు చుడుతుండగా విద్యుదాఘాతం సంభవించి అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి భార్య రాజమణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో పేర్కొన్నారు.

రైల్వేస్టేషన్‌లో ఇద్దరి మధ్య ఘర్షణ


- ఒకరి మృతి



ఖలీల్‌వాడి: జిల్లా కేంద్రంలోని రైల్వేస్టేషన్‌లో ఇద్దరు వ్యక్తులు గొడవపడిన ఘటనలో ఒకరు మృతి చెందినట్లు ఎస్సై సాయిరెడ్డి తెలిపారు. నాందేడ్‌కు చెందిన సతీశ్‌శర్మ(40), రాజు(45) రైల్వేస్టేషన్‌లోని ప్లాట్‌ఫాం నంబర్-1 ప్రాంతంలో గొడవపడ్డారు. ఈ ఘటనలో రాజు సతీశ్‌ను నెట్టేయడంతో ప్లాట్‌ఫాం మీద పడి తలకు తీవ్రగాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

కుటుంబ కలహాలతో ఆత్మహత్యాయత్నం

- క్షణికావేశంలో ఎలుకల మందు తాగిన భర్త
- పిల్లలకు తాగించిన వైనం


చికిత్స పొందుతున్న శ్రీకాంత్, సాత్విక, సహస్ర

కామారెడ్డి క్రైం: భార్యతో గొడవ కారణంగా క్షణికావేశానికి గురైన ఓ వ్యక్తి తాను తాగడమే కాకుండా ఇద్దరు కుమార్తెలకు ఎలుకల మందు తాగించాడు. ఈ ఘటన కామారెడ్డిలోని షేర్ గల్లీలో శుక్రవారం రాత్రి జరిగింది. ప్రస్తుతం వారు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. స్థానికుల కథనం ప్రకారం.. కాలనీకి చెందిన చల్ల శ్రీకాంత్ అనే వ్యక్తికి భార్య రాజ్యలక్ష్మి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. శ్రీకాంత్ చాలా రోజులుగా ఎలాంటి పని చేయకుండా తిరుగుతున్నాడు. అతని భార్య ఓ ప్రైవేటు ఆస్పత్రిలో నర్సుగా పని చేస్తోంది. ఆర్థికంగా ఇబ్బందులు పెరగడంతో భార్యాభర్తల మధ్య గొడవలు మొదలయ్యాయి. శుక్రవారం సాయంత్రం వీరి మధ్య మరోసారి గొడవ జరిగింది. దీంతో క్షణికావేశానికి గురైన శ్రీకాంత్ ఎలుకల మందు నీటిలో కలిపి తాగేశాడు. ఆపై తన కుమార్తెలు సాత్విక, సహస్రలకు తాగించాడు. కుటుంబ సభ్యులు గమనించి వారిని ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం వీరి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని ఆస్పత్రి వర్గాలు చెబుతున్నాయి. పట్టణ పోలీసులు విచారణ చేపడుతున్నారు.

చికిత్స పొందుతూ వీఆర్‌ఏ మృతి


మహేందర్ (ఫైల్)

డిచ్‌పల్లి: మండలంలోని డిచ్‌పల్లి ఖిల్లా గ్రామానికి చెందిన వీఆర్‌ఏ దాసరి మహేందర్ (35) ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందాడు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. రెండు నెలల క్రితం మహేందర్ అకస్మాత్తుగా కింద పడి కోమాలోకి వెళ్లాడు. మొదట జిల్లా కేంద్రంలోని ఓ ఆస్పత్రిలో చికిత్స అందించినా ఫలితం లేకపోవడంతో కుటుంబీకులు హైదరాబాద్‌లోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందాడు. మృతుడికి భార్య నవనీత, ముగ్గురు కుమారులు ఉన్నారు. గ్రామస్తులకు తలలో నాలుకలా మెలిగే మహేందర్ కోమాలోంచి బయటకు రాకుండానే మృతి చెందడంతో డిచ్‌పల్లిలో విషాదం నెలకొంది. ఇల్లు కట్టుకునేందుకు పోగు చేసుకున్న సుమారు రూ. 15 లక్షల నగదు అతడి చికిత్సకు ఖర్చు చేసినా ఫలితం లేకుండా పోయింది. రెవెన్యూ అధికారులు అంత్యక్రియల కోసం రూ.10వేలు అందజేశారు. శుక్రవారం జరిగిన అంత్యక్రియల్లో గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొట్టిన ఘటనలో మహిళ..

ఆర్మూర్‌టౌన్: మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో బస్సు ఢీకొన్న ఘటనలో తీవ్రంగా గాయపడ్డ సుజాత(55) చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందింది. వివరాలిలా ఉన్నాయి. ఈనెల 12న బస్టాండ్‌లో నిర్మల్‌కు చెందిన సుజాత ఆర్మూర్‌లో ఉంటున్న తన కుమార్తె ఇంటికి వచ్చింది. బస్సు దిగి నడుచుకుంటు వెళ్తుండగా బస్సు ఢీకొన్నది. ఈ ఘటనలో ఆమె రెండు కాళ్లు నుజ్జునుజ్జయ్యాయి. దీంతో కుటుంబీకులు జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు.

మూడు స్కూల్ బస్సులు సీజ్

ఖలీల్‌వాడి: నగరంలోని వినాయక్‌నగర్, పులాంగ్ చౌరస్తా వద్ద నిర్వహించిన తనిఖీల్లో సరిగా ఫిట్‌నెస్ లేని మూడు స్కూల్ బస్సులను సీజ్ చేసినట్లు డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ పరిమళ శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. యాజమాన్యాలు తమ పాఠశాల బస్సులకు తప్పనిసరిగా ఫిట్‌నెస్ పరీక్షలు చేయించాలన్నారు. తనిఖీలో ఆర్‌టీవో కిరణ్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

విద్యుదాఘాతంతో లైన్‌మన్‌కు గాయాలు

బాన్సువాడ రూరల్: మండలంలోని తాడ్కోల్‌లో విద్యుత్ సరఫరాకు మరమ్మతులు చేస్తుండగా లైన్‌మన్ దస్తగిరి విద్యుదాఘాతానికి గురికావడంతో చేతికి తీవ్రగాయమైంది. గ్రామస్తులు చికిత్స నిమిత్తం బాన్సువాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా ప్రథమ చికిత్స నిర్వహించిన వైద్యులు మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు.

ఇసుక టిప్పర్ పట్టివేత

నవీపేట: ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ఓ టిప్పర్‌ను పక్కా సమాచారం మేరకు దాడి చేసి పట్టుకున్నట్లు ఎస్సై యాదగిరిగౌడ్ శుక్రవారం పేర్కొన్నారు. రెంజల్ మండలంలోని సాటాపూర్ నుంచి నిజామాబాద్ వైపు ఇసుకను అక్రమంగా తరలిస్తుండగా అబ్బాపూర్(ఎం) శివారులో పట్టుకొని రెవెన్యూ అధికారులకు అప్పగించినట్లు తెలిపారు. టిప్పర్‌కు రూ. 20 వేల జరిమానా విధించినట్లు పేర్కొన్నారు. ఎవరైనా ఇసుకను అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

గొల్లపేటలో గొడవ

కమ్మర్‌పల్లి: మండల కేంద్రంలోని గొల్లపేట ఇందిరమ్మ కాలనీలో ఇద్దరి మధ్య జరిగిన గొడవ కత్తెరతో దాడికి దారి తీసింది. కాలనీలో నివాసం ఉంటున్న బిట్టుకు, నజీర్‌కు కొంత కాలంగా విభేదాలు కొనసాగుతున్నాయి. శుక్రవారం పాత కక్షలతో ఇద్దరి మధ్య గొడవ మొదలైంది. ఈక్రమంలో బిట్టు కత్తెరతో నజీర్‌పై దాడి చేశాడు. దీంతో నజీర్‌కు తీవ్రగాయాలు కావడంతో ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్ ప్రమాదాల నివారణకు చర్యలు

- విద్యుత్‌శాఖ ఎస్ఈ రవీందర్

నిజామాబాద్‌నాగారం: జిల్లాలో విద్యుత్ ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టినట్లు విద్యుత్‌శాఖ ఎస్ఈ రవీందర్ శుక్రవారం పేర్కొన్నారు. గృహాల్లో నాణ్యమైన వైరింగ్ లేకపోవడం, నాసిరక విద్యుత్ పరికరాలు వాడటం, రైతులు పొలాల వద్ద స్విచ్ బోర్డుల దగ్గర భద్రత ప్రమాణాలు పాటించకపోవడంతోనే విద్యుత్ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని అన్నారు. ఉద్యోగులు భద్రతపై జాగ్రత్తగా వ్యవహరించాలని సూచిస్తూ భద్రత పరికరాలు అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యుత్ ప్రమాదాలను నివారించడానికి ఫీల్డ్ సిబ్బంది నుంచి సీనియర్ అధికారుల వరకు సమష్టి కృషి అవసరమన్నారు. జీరో విద్యుత్ ప్రమాదాలే ధ్యేయంగా ఉద్యోగులు, సిబ్బంది పని చేయాలని కోరారు.

జాగ్రత్తలు ఇలా..

- సెక్షన్ ఇన్‌చార్జి ప్రతిరోజూ 15 నిమిషాలు పనికి ముందు భద్రతా చర్యల గురించి సిబ్బందితో చర్చించాలి.
- అనుమతి కలిగిన అధికారి మాత్రమే లైన్ క్లియర్ ఇవ్వాలి. ఫోన్ ద్వారా లైన్ క్లియర్లను ఇవ్వడాన్ని నివారించాలి.
- సెక్షన్ ఆఫీసర్, సబ్ డివిజన్ ఆఫీసర్ (ఏడీఈ) వద్ద బ్రేక్ డౌన్ల సమాచారం, నిర్వహణ పనులు చేసిన ఫీల్డ్ సిబ్బంది పేర్లు ఉండాలి.
- ఫీల్డ్ సిబ్బందికి అన్ని భద్రతా పరికరాలను అందుబాటులో ఉంచాలి.
- మెయింటెనెన్స్/అవుట్ వర్క్ జరుగుతున్న చోట సెక్షన్ ఆఫీసర్/ఏడీఈ ఆకస్మిక తనిఖీ చేపట్టాలి. భద్రతా ప్రక్రియలో ఏదైనా ఉల్లంఘన ఉన్నట్లు తేలితే చర్యలు తీసుకోవాలి.
- హెచ్‌టీ/ఎల్‌టీ లైన్ల పనిని ప్రారంభించే ముందు చేతి తొడుగులు, ఎర్త్ డిశ్చార్జ్ రాడ్, వోల్టేజ్ డిటెక్టర్ తప్పనిసరిగా తీసుకెళ్లాలి.
- విద్యుత్ ప్రమాదాలు, భద్రతా జాగ్రత్తలను ప్రజలకు సదస్సుల ద్వారా అవగాహన కల్పించాలి.

దరఖాస్తుల ఆహ్వానం

నిజామాబాద్‌నాగారం: జిల్లా కేంద్రంలోని నిరుద్యోగ యువత జపాన్‌లో నిర్వహించే నర్సింగ్ ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ఉపాధి అధికారి సిరిమల్ల శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్ పవర్ కంపెనీ లిమిటెడ్, తెలంగాణ ప్రభుత్వ కార్మిక, ఉపాధి, శిక్షణ, కర్మాగారాల శాఖ ద్వారా ఈ నియామకాలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. టామ్‌కామ్ ద్వారా శిక్షణ పొందిన 2 బ్యాచ్‌ల నర్సింగ్ అభ్యర్థులు 31 మంది ఇప్పటికే జపాన్‌లోని ప్రసిద్ధ ఆస్పత్రిల్లో పనిచేస్తున్నారని అన్నారు. 3వ బ్యాచ్ నర్సింగ్ అభ్యర్థులు టామ్‌కామ్ ద్వారా శిక్షణ తీసుకుంటున్నారని తదుపరి బ్యాచ్‌ల ఎంపిక కోసం టామ్‌కామ్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తోందని పేర్కొన్నారు. అర్హులైన అభ్యర్థులు ఈ నెల 20లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9951909863, 6302292450, 9573945684 నంబర్లను సంప్రదించాలన్నారు.

వివాహేతర సంబంధమే ప్రాణం తీసింది

డిచ్‌పల్లి: వివాహేతర సంబంధం ఓ మహిళ ప్రాణాలు తీసింది. ఈ నెల 12న ప్రమాదవశాత్తు మృతి చెందిన మహిళ హత్య కేసును పోలీసులు ఛేదించారు. నిందితుడిని శుక్రవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. డిచ్‌పల్లి సీఐ మల్లేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఇందల్వాయి గండి తండాకు చెందిన పవార్ లలిత(30)కు 2010లో కామారెడ్డి జిల్లా గాంధారి మండలం కొత్తబాది తండాకు చెందిన తులసీరాంతో వివాహం జరిగింది. ఏడాది కాలంగా భార్యభర్తల మధ్య గొడవలు జరగడంతో లలిత తన చిన్నకొడుకుతో కలిసి వేరుగా జీవిస్తోంది. ఈ తరుణంలో అదే తండాకు చెందిన రాథోడ్ వినోద్‌తో లలితకు పరిచయం ఏర్పడింది. ఈ నెల 4న డిచ్‌పల్లికి వచ్చి తాము భార్యాభర్తలమని చెప్పి డిచ్‌పల్లి రైల్వేస్టేషన్ వద్ద ఇల్లు కిరాయికి తీసుకుని ఉంటున్నారు. లలితను వదిలించుకోవాలనే ఉద్దేశంతో హత్య చేయాలని వినోద్ నిర్ణయించుకున్నాడు. ఈ నెల 12న మధ్యాహ్నం నడిపల్లి చెరువు వద్దకు తీసుకెళ్లి లలితను గొంతు నులిమి చెరువులో పడేశాడు. ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందినట్లు చిత్రీకరించేందుకు యత్నించాడు. కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టిన డిచ్‌పల్లి సీఐ మల్లేశ్ లలితను వినోద్ హత్య చేసినట్లు గుర్తించారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో విచారణ చేపట్టగా తానే హత్య చేసినట్లు అతడు అంగీకరించాడు. దీంతో శుక్రవారం నిందితుడు వినోద్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. కేసు దర్యాప్తులో డిచ్‌పల్లి ఎస్సై యూ మహేశ్ సహాయ అధికారిగా వ్యవహరించారు. వివాహేతర సంబంధానికి ఓ నిండుప్రాణం బలవగా ఆమె పిల్లలు తల్లిలేని అనాథలుగా మారారు.

లారీని ఢీకొట్టిన ఐచర్ వాహనం



బాల్కొండ: ఆగిఉన్న లారీని ఐచర్ వాహనం ఢీకొట్టిన ఘటనలో డ్రైవర్‌కు తీవ్రగాయాలైన ఘటన మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. ఆర్మూర్ నుంచి నిర్మల్ వైపు వెళ్తున్న ఐచర్ వాహనం బాల్కొండ మండల శివారులో హెచ్‌పీ పెట్రోల్ పంపు వద్ద ఆగి ఉన్న ఢీకొట్టింది. ఈ ఘటనలో ఐచర్ వాహనంలోని డ్రైవర్ స్టీరింగ్ మధ్యలో ఇరుక్కుపోయాడు. జేసీబీ సహాయంతో డ్రైవర్‌ను బయటకు తీశారు. డ్రైవర్‌కు కాలు విరిగడంతో తీవ్రగాయాలయ్యాయి. ఇదిలా ఉండగా ఐచర్ వాహనం పెట్రోల్ పంపు సమీపానికి రావడానికి ముందే తమిళనాడు నుంచి బోపాల్ వెళ్తున్న ఆయిల్ లారీని ఢీకొట్టి అదుపు తప్పి ఆగి ఉన్న లారీని ఢీకొన్నది. తీవ్రంగా గాయపడ్డ డ్రైవర్‌ను 108 అంబులెన్స్‌లో ఆర్మూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బాల్కొండ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఒంటరి జీవితం భరించలేక ఆత్మహత్య


కాశీ నగేశ్(ఫైల్)

లింగంపేట: తల్లితండ్రులు లేక ఒంటరి జీవితం గడుపుతున్న ఓ యువకుడు జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని మత్తడి కిందిపల్లెలో శుక్రవారం చేసుకుంది. ఎస్సై చైతన్య కుమార్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కాశీ నగేశ్(20) తల్లి తండ్రులు, సోదరి కొన్నేళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో నాటి నుంచి పెద్దనాన్న అయిన కాశీ చంద్రయ్య వద్ద ఉంటున్నాడు. నగేశ్ పెద్దనాన్నకు చెప్పకుండా ఇంటి నుంచి వెళ్లిపోయాడు. ఏడాది క్రితం స్వగ్రామానికి వచ్చి పెద్దనాన్నతో ఉంటున్నాడు. తల్లితండ్రులు లేని జీవితం ఇలా ఎన్ని రోజులు గడపాలంటు మనోవేదనకు గురై స్థానిక ఎల్లమ్మ ఆలయ సమీపంలో ఉన్న చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి పెద్దనాన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

అత్తను చంపిన కోడలు

- పొలం డబ్బుల విషయంలో గొడవ
- క్షణికావేశంలో గొంతునులిమి హత్య


విచారణ చేపడుతున్న పోలీసులు

బిచ్కుంద(జుక్కల్): పొలం డబ్బుల విషయంలో అత్తాకోడళ్ల మధ్య జరిగిన గొడవలో క్షణికావేశంలో అత్తను కోడలు గొంతు నులిమి హత్య చేసిన ఘటన మండలంలోని బండారెంజల్‌లో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్సై మోహన్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బాలవ్వ విఠబోయి, కుమారుడు బాబు కోడలు అంజవ్వతో కలిసి ఉంటున్నారు. అత్తా కోడళ్ల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో పొలానికి సంబంధించిన రూ. 48000 వచ్చాయి. తమ నగదును ఆడపడుచులకు ఖర్చు పెడుతున్నావని ఈ సారి పొలం డబ్బులు నాకు ఇవ్వాలంటు అత్తతో అంజవ్వ గొడవ పడింది. క్షణికావేశంలో అంజవ్వ అత్తను గొంతునులిమి హత్య చేసి వెళ్లిపోయింది. పొలం పనుల నుంచి ఇంటికి వచ్చిన మామ విఠబోయి తన భార్య బాలవ్వ ఊపిరి తీసుకోకపోవడాన్ని గుర్తించి పరిశీలించగా గొంతు నులిమి హత్య చేసినట్లు గుర్తించాడు. ఈ విషయమై కోడలిని నిలదీశాడు. వెంటనే పోలీసులు సమాచారం ఇవ్వడంతో ఘటన స్థలానికి బాన్సువాడ సీఐ సత్యనారాయణ, ఎస్సై మోహన్‌రెడ్డి చేరుకొని విచారణ చేపట్టారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

తల్లి మందలించిందని..

- సెల్ టవర్ ఎక్కిన యువకుడు



నస్రుల్లాబాద్: ఇంట్లో జరిగిన గొడవలో తల్లి మందలించిందని ఓ యువకుడు సెల్ టవర్ ఎక్కిన ఘటన మండలంలోని బొమ్మన్‌దేవ్‌పల్లిలో శుక్రవారం చోటు చేసుకుంది. గ్రామస్తులు, ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన శేఖర్ అతని భార్యతో గొడవ జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఇటీవల శేఖర్‌ను తన భార్య నిజామాబాద్ రైల్వే స్టేషన్‌లో తీవ్రంగా గాయపరిచి మరో వ్యక్తితో వెళ్లిపోయిందన్నారు. ఈ విషయంలో నిజామాబాద్ రైల్వే, స్థానిక పీఎస్‌లో కేసు నమోదైందని గ్రామస్తులు తెలిపారు. ఈ క్రమంలో తన తల్లితో ఇంట్లో గొడవ జరగగా మందలించింది. దీంతో టవర్ ఎక్కి అందిరికి ఫోన్‌లో సమాచారం అందించాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని శేఖర్‌ను సముదాయించి కిందికి దిగేలా చేశారు. పీఎస్‌కు తరలించి కౌన్సెలింగ్ ఇచ్చారు.

రిపోర్టర్‌పై కేసు నమోదు

నిజామాబాద్‌రూరల్: గ్రామ పంచాయతీ కార్యదర్శిపై అసత్య ప్రచారాలు చేయడమే కాకుండా చంపుతానని బెదిరించిన ఓ రిపోర్టర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌వో మహేశ్‌కుమార్ శుక్రవారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని గుండారం గ్రామానికి చెందిన ఓ రిపోర్టర్ ఆన్‌లైన్ పత్రికలో, యూట్యూబ్ చానళ్లలో పనిచేస్తున్నాడు. సదరు రిపోర్టర్ ఎన్నికల సమయంలో గ్రామ స్వాగత తోరణ సమీపంలో తాను నిర్వహిస్తున్న కిరాణషాపు వెనుక భాగంలో అక్రమంగా పిల్లర్లు వేసి గదిని నిర్మించాడు. ఈ విషయమై తహసీల్దార్‌కు జీపీ కార్యదర్శి ఫిర్యాదు చేశాడు. తహసీల్దార్ ఆదేశాల మేరకు మే 27న చేపట్టిన నిర్మాణ పనులను జేసీబీతో తొలగించారు. దీంతో సదరు రిపోర్టర్ జీపీ కార్యదర్శి సుధాకర్‌రెడ్డిపై అసత్య ప్రచారాలు చేపడుతూ చంపుతానని బెదిరింపు చర్యలకు పాల్పడ్డాడు. దీంతో జీపీ కార్యదర్శి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.